

# ’అదే’ కథలు

**– ఆర్.శర్మ దంతుర్తి**

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని ‘దేశీ’లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం ‘య’ అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకీ, బాధలకీ, దుఃఖాలకీ నా బాధ్యత లేదు.

## 57

## ప్రయోజకుడు

**కృష్ణారావు చిన్నప్పట్నుంచే** తెలివైనవాడిగా ఊర్లో తెలుసు. ఐఐటి లో జేరేంత సరుకు కాదు కానీ తెలివైనవాడే. బి.టెక్ లో సీటొచ్చాక అంచెలంచెలుగా అమెరికా వచ్చేసాడు ఎమ్ ఎస్ చేయడానికి. మొదటి సంవత్సరం చివరిలో కృష్ణారావు తాను జేరిన కాలేజీ ఓ కాన్ఫరెన్స్ నిర్వహిస్తే అందులో ప్రముఖంగా కనిపించేడు అనేక పనులు చేస్తూ. దాన్లో భాగమే వచ్చినవారికి అన్నీ అమర్చడం; తన డిపార్ట్ మెంట్ కీ, ప్రొఫెసర్లకీ ఎక్కడా ఎవరిచేతా మాట రాకుండా చూడడం; అన్నింటికీ మించి ఒక మంచి పేపర్ కాన్ఫరెన్సులో చదవడం వగైరా. కృష్ణారావుకి తెలియని విషయం ఏమంటే ఇదంతా మీటింగ్ లో చూసిన ఓ అమ్మడు – అమెరికాలో పుట్టిన మన దేశీ అమ్మాయే మనసు పారేసుకుంది కృష్ణా మీద. అది మీటింగ్ అయిన నెల దాకా తెలియలేదు మనవాడికి. మనవాడినీ, చదివిన పేపర్నీ, మీటింగ్ లో చూపించిన కలుపుగోలుతనానికీ, అందరికీ అన్నీ అమర్చిన నేర్పరితనానికీ దంగై పోయిన అమ్మడు నెల పోయాక గుర్తు పెట్టుకుని మరీ ఫోన్ చేసి – కంగ్రాట్స్ అంటూ తన విషయాలు చెప్పింది. మెడికల్ కాలేజ్ లో మూడో సంవత్సరం చదువుతోందిట. న్యూజెర్సీ కుటుంబం; కులం అంటూ గూట్లే ప్రశ్నలు వేయరాదు కనక అంతటితో పరిచయం సమాప్తం. మెల్లిగా నెలకో సారి ఫోన్ చేసే అమ్మడు, తన స్వంత ఘోషా, తల్లీ తండ్రీ అంటూ విషయాలు చెప్పడం మొదలుపెట్టింది. మరో నెలకి

ఈమెయిల్ మీద విషయాలు చెప్పుకున్నారు. ఫోటోలు మార్చుకోవడం అయింది కూడా. అమ్మడి నాన్నగారు డాక్టర్. కూతురు డాక్టర్ కనక రాబోయే అల్లుడు కూడా డాక్టరై తీరాలి అనే నియమం ఉంది. ఆ మాట వినగానే కృష్ణారావు కంగారు పడ్డాడు. తానేమో ఇంజినీర్. ఇది కుదిరే వ్యవహారం కాదులే అనుకుని ఊరుకున్న మూడో నెలకి మరోసారి అమ్మడి నుంచి ఫోను వచ్చింది. కొంచెం ఆశ్చర్యమే ఈ సారి అవిడ చెప్పిన విషయాలు.

మెడికల్ కాలేజీ చివరిలోకి వచ్చిన అమ్మణ్ణి నాన్న పెళ్ళి చేసుకోమని పోరుతున్నాడు. తెలుపో నలుపో గోధుమో ఏదో ఒక సంబంధం ఉంటే చాలు. అప్పుడు ధైర్యం చేసి చెప్పేసింది అమ్మడు కృష్ణారావు గురించి. ఇంజినీర్ కుదరదు కనక ఏం చేయాలో తెలియదు. అప్పుడు అమ్మడి నాన్నే ఒక దారి చెప్పాడు. కృష్ణా నిజంగా తెలివైనవాడైతే ఇప్పుడు అమెరికాలో మరోసారి బయాలజీ వగైరాలు చదివి మెడికల్ కాలేజీలో చేరగలడా? అంత తెలివి ఉంటే నిజంగా అమ్మడికీ కృష్ణాకి పెళ్ళిచేయడానికి ఏమీ అభ్యంతరం లేదు. ఇదీ అమ్మడు చెప్పిన సంగతి. విషయం కృష్ణా తనకి తెల్సిన స్నేహితుల్తో చర్చించాడు. అందరూ చెప్పినదేమంటే, అమ్మడు ఇక్కడే పుట్టింది కనక పెళ్ళి అయితే గ్రీన్ కార్డు మూడునెలల్లో వస్తుంది కృష్ణాకి. అయితే మెడికల్ కాలేజీలో చేరడం అంత ఈజీ వీజీ కాదు. జేరాక డబ్బులుండాలి కాలేజీ ఫీజులకి. ఇంజినీరింగ్ చదివి ఉద్యోగం అయితే సంపాదించుకోవచ్చు కానీ డాక్టర్ కి వచ్చినన్ని డబ్బులు ఇంజినీర్ కి రావు. ధైర్యం ఉంటే ప్రొసీడ్. ఇది విన్నాక కృష్ణా మరో సారి ఆలోచించాక అమ్మడితో చెప్పాడు. తాను మెడికల్ కాలేజీకి కావాల్సిన కోర్సులు చేసి ఎంట్రన్స్ రాయడం వరకూ సిద్ధమే కానీ ఫీజులు తట్టుకోలేడు. ఈ విషయం అమ్మడు తన నాన్నతో చెప్తే ఆయన మరో దారి చూపించేడు. మెడికల్ కాలేజీలో సీటు వచ్చే స్కోర్ మనోడికి వస్తే తాను దగ్గిర ఉండి పెళ్ళి జరిపిస్తాడు, ఫీజుకి బేంకులు ఉన్నాయి, తానూ గారంటీ సంతకం పెడతాడు.

అలా కృష్ణా ఎమ్ ఎస్ రెండో సంవత్సరం చదువుతూ, కొన్ని బయాలజీ క్లాసులు చేసి, ఎమ్ ఎస్ అయ్యేసరికి మెడికల్ కాలేజీ ఎంట్రన్స్ కి సిద్ధమైపోయేడు. కానీ మరో ఆరునెలలు ఆగాల్సి వచ్చింది మరో కెమిస్ట్రీ కోర్సో మరోటో చేయడానికి. అదీ మంచిదే అన్నట్టు ఈ లోపుల మరోసారి పుస్తకాల చెదలు దులపడం, మళ్ళీ పరీక్ష ప్రిపేర్ అవడం వగైరా. ఏమైతేనేం మొదటి సారే కుర్రాడు తాను 'జాంతా నై' కాదనీ అసలు సిసలు బుర్ర ఉన్న వాణ్ణినీ నిరూపిస్తూ మెడికల్ కాలేజ్ ఎంట్రన్స్ లో స్కోర్ సంపాదించేడు. ఆ ఏడు సెప్టెంబర్ వచ్చేసరికి అమ్మడు రెసిడెన్సీలో ఉండగా కృష్ణారావు మొదటి సంవత్సరం మెడికల్ కాలేజీలో జేరిపోయేడు. అయితే ఇందులో జేరడానికి కొంచెం డబ్బులూ వీసా మార్పు కావాల్సొచ్చాయి. మొదట్లో వప్పుకున్నట్టూ మామగారు ఓ చెయ్యి వేసాడు బేంక్ ఋణానికి. పెళ్ళిదేవుంది, గుళ్ళో పూజార్ని పెట్టి పదిరోజుల్లో జరిపించేరు. వీసా వెంటనే మార్చబడింది.

ఇందులో ఒక తిరకాసు వచ్చింది. తల్లి తండ్రులకి ఫోన్ లో చెప్పి పెళ్ళికి రమ్మని పిల్చేడు కృష్ణా. "జీవితం అంతా వీడికి చదువు చెప్పించి ఉద్ధరిస్తాడనుకుంటే వీడు చేసిన పని ఇదా అమెరికా వెళ్ళాక? కొంతకాలం ఏడిచాక మా కొడుకు చచ్చేపోయాడు వాడికీ మాకూ ఇంక ఏమీ సంబంధం లేదు" అని చెప్పుకున్నారు ఊళ్ళో. అటూ ఇటూ రాక పోకలు స్థంభించాయి. ఎప్పుడైనా కృష్ణా ఇక్కడి ఫోటోలు ఇండియా పంపినా వాళ్లు సమాధానం ఇవ్వడం లేదు. సరే చేసేదేం లేదు కనక ఇంజినీరింగ్ వదిలేసిన కృష్ణా సరిగ్గా నాలుగేళ్లలో ఆర్థోపెడిక్స్ స్పెషలైజేషన్ తో బయటకొచ్చేడు. మిగతా అంతా రొటీన్ పని. మరో మూడేళ్ల రెసిడెన్సీ అయ్యేక డాక్టర్ ఉద్యోగంలో చేరాడు కృష్ణా. ఈ లోపుల మిగతా పిల్లలు ఎదిగొచ్చారు అక్కడ ఇండియాలో. అప్పుడు కృష్ణా ఇండియా వచ్చేడు, అవును ఒకడే. గంటు మొహంతో మొదట్లో మాట్లాడకపోయినా కృష్ణారావు చెప్పిన విషయం విన్నాక అందరూ కల్సిపోయేరు.

ఇంతకీ కృష్ణారావు చెప్పిన విషయం ఇదీ – తాను అమెరికన్ అమ్మణ్ణి చేసుకున్నాక గ్రీన్ కార్డ్ వచ్చింది, వెంటనే సిటిజెన్ గా మారడానికి అప్లై చేసాడు కొన్నేళ్ళు ఆగి. ఇప్పుడు తానో అమెరికన్. పాస్ పోర్టు అప్లై చేసుకోండి తల్లీ తండ్రీ. వెంటనే అమెరికా వెళ్ళిపోవచ్చు మొత్తం కుటుంబం అంతా. మిగతా పిల్లలు తమ్ముడూ చెల్లీ రావడానికి తానో మార్గం ఆలోచించాడు. తన మామగారు ఎంతైనా సహాయం చేస్తాడు. ఆయన మాత్రం దేశీయుడు కాదా? ఇండియా ఊళ్ళో కొంతమంది 'మా కొడుకు చచ్చిపోయినట్టే' అని చెప్పున్నారు కదా అని ఎవరినా అడుగుతారేమో అనే సందేహం అనవసరం. ఎదిగొచ్చిన కొడుకు ఇపుడు కోట్లు సంపాదించే అమెరికన్ డాక్టర్. అయినా మన పిచ్చి కాకపోతే ఏడూ ఎనిమిది ఏళ్ల క్రితం మనం ఏమి మాట్లాడేమో ఎవరికి గుర్తు? ఎవడి ఏడుపు వాడికి ఉంది కదా?

వెనక్కి అమెరికా వచ్చిన కృష్ణా లాయర్ని పట్టుకుని తల్లీ తండ్రీ రావడానికి ఏర్పాటు చేసాడు. ఈ లోపుల చెల్లికి ఒక అమెరికా కుర్రాడి సంబంధం చూసాడు కూడా. కాబోయే బామ్మర్ది ఏదో స్కూల్లో ఎమ్ ఎస్ చేస్తున్నాడు. వాడికి ఉద్యోగానికి ఢోకా లేదు. ఏదో ఒకటి వస్తుంది. తమ్ముడు వైజాగ్ లో ఎమ్మెస్సీ లో ఉన్నాడు కనక వాడు టోఫెల్, జి అర్ ఇ రాసాడంటే విమానం ఎక్కడం జస్ట్ ఎ మేటర్ ఆఫ్ టైమ్.

కృష్ణారావు ఇండియా రావడం, తల్లీ తండ్రీతో మాట్లాడ్డం ఇదంతా జరిగిన సరిగ్గా మూడేళ్లకి చెల్లెలు పెళ్ళైపోయి అమెరికా వచ్చేసింది మొగుడితో పాటు. తమ్ముడు కాలిఫోర్నియాలో ఎమ్ ఎస్ లో జేరిపోయేడు. కృష్ణారావు డాక్టర్ గా అమ్మడితో పాటు చికాగోలో స్థిరపడ్డాడు. ఇప్పుడు వీళ్ళెవరికీ దేశం వెళ్ళే పనిలేదు కానీ ఎప్పుడైనా కృష్ణారావుకి బోరు కొడితే ఇండియాలో ఉన్న మేనమావ దగ్గిరకి వెళ్తూ ఉంటాడు – ఔను ఒక్కడే. వెళ్ళినప్పుడు విహారయాత్రలో భాగంగా గోవా, కేరళా తిరగడం పరిపాటి. ఒక్కోసారి అమ్మడు వస్తానంటుంది కానీ ఈయన వద్దనేస్తాడు. ఆయన కారణాలు ఆయనవి. అమ్మడు అమెరికాలో పుట్టి పెరిగింది కనక ఆవిడ అక్కడితో వదిలేస్తుంది రెట్టించకుండా.

ఏమైనా ఇప్పుడు తల్లీ తండ్రీ మాత్రం కృష్ణారావు తమ స్వంత కొడుకు అనీ ఎంతో కష్టపడి చదువుకుని పైకి వచ్చాడనీ అందరితో చెప్పడం కద్దు. వేరు కులం అమ్మాయిని చేసుకున్నందుకు ఓ సారి 'మా కొడుకు చచ్చిపోయాడు; వాడికీ మాకూ సంబంధం లేదు' అన్నారంటే కోపంలో అన్నారు కానీ నిజం కాదు కదా? అయినా మన వేమన ఏనాడో చెప్పలేదుటండీ? ఇంకా తెలియకపోతే ఈ కింది నీతి చదువుడు. మలయజము అనగా గంధపు చెట్టు.

నీతి :

ఆ. కులములోన నొకడు గుణవంతుడుండిన
కులము వెలయు వాని గుణముచేత
వెలయు వనములోన మలయజమున్నట్లు
విశ్వదాభిరామ వినురవేమ

Post your comments